## జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు



మద్దూరులో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ హరికిషన్

మద్దూరు(ధూళిమిట్ట), మే 23 : మద్దూరు మండల కేంద్రంలో పశువైద్యాధికారి డాక్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని 1625 గొర్రెలు, 482 మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా ఈ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పెంపకందార్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎల్‌వో పర్వయ్య, వీఏ నవీన్, ఓఎస్ రాజు, గొర్రెల-మేకల పెంపకందార్లు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



హుస్నాబాద్ పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర

హుస్నాబాద్‌టౌన్, మే 23 : హుస్నాబాద్‌లో హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో గురువారం శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక పాటిమీద హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్రలో ఆంజనేయస్వామి చిత్రపటంతో మల్లెచెట్టుమీదుగా అంబేద్కర్‌చౌరస్తా వరకు సాగింది. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీమున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కౌన్సిలర్లు పెరుక భాగ్యారెడ్డి, వల్లపు రాజు, ఆలయ కమిటీకి చెందిన నూకల కైలాసం, నీరుమల్ల శ్రీనివాస్, బెజుగం లక్ష్మణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలి

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 23 : కేసీఆర్ ప్రభుత్వం గొల్ల, కుర్మలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వారి అభ్యున్నతి కోసం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి కోరారు. ఈసందర్భంగా గురువారం గజ్వేల్‌లో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ హయాంలో గొర్రెల కోసం డీడీలు కట్టిన వారికి ప్రభుత్వం వెంటనే గొర్రెలను పంపిణీ చేసేలా చూడాలన్నారు. డీడీలు కట్టి నెలలు గడుస్తున్న ప్రభుత్వం ఈ పథకంపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో వేలాది మంది గొల్ల, కుర్మలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు ఇవ్వకపోతే తాము కట్టిన డీడీల డబ్బులైనా ప్రభు త్వం ఇస్తదా లేదా అనే సందేహం వారిలో వ్యక్తమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంత గొల్ల, కుర్మల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈపథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా ఈ పథకాన్ని అమలు చేసి గొల్ల, కుర్మలకు అండ గా నిలవాలన్నారు.

## గౌతమ బుద్ధుడికి నివాళి

హుస్నాబాద్, మే 23 : హుస్నాబాద్‌లోని విద్యావాణి స్కూల్ ఆవరణలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేఏసీ కో-ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు మానవతా విలువలను పెంపొందించే విధంగా తన బోధనలను చేశారన్నారు. అంతరాలు లేని వ్యవస్థ ఏర్పాటు చేయడానికి బుద్ధుడి బోధనలు దోహదపడుతాయని, వర్ణ వ్యవస్థను నిరసించి మనుషులంతా ఒకటే అని చాటిన ఘనత ఆయనదేనన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వడ్డెపల్లి మల్లేశం, ఇల్లెందుల లక్ష్మణ్‌గౌడ్, పొన్నాల ఫ్రాన్సిస్, సమ్మయ్య పాల్గొన్నారు.

### ఆవాలతో బుద్ధుడు..

గజ్వేల్, మే 23 : బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకులు రామరాజు బుద్ధుడి చిత్రాన్ని ఆవాలుతో అత్య అద్భుతంగా గురువారం రూపొందించారు.



ఆవాలుతో రూపొందించిన బుద్ధుడి చిత్రం

## రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

కోహెడ, మే 23 : మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీలో గురువారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కోహెడ పోలీసులతో కలిసి 65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం మేరకు గంట ఎల్లమ్మ, గంట ఎల్లవ్వ, గంట బుచ్చమ్మలు బియ్యాన్ని సేకరించి నిల్వచేసి ఉంచారని పోలీసులు తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వ ఉంచిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712667445, 8712667446కి తెలుపాలన్నారు.

## వర్షాకాలంలో ఇబ్బందులు రానివొద్దు

గజ్వేల్, మే 23 : వర్షాకాలంలో వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అందుకు తగిన విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను మున్సిపల్ కమిషనర్ నర్సయ్య ఆదేశించారు. ఈసందర్భంగా గురువారం పట్టణంలో పేరుకపోయిన మురుగునీటి కాల్వలను శుభ్రం చేయించారు. ప్రజ్ఞాపూర్, పిడిచేడ్ రోడ్ల వెంటడి వర్షంనీరు త్వరగా మురుగు కాల్వలోకి వెళ్లెలా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ కిష్టన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.



మురుగుకాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సయ్య

# వైభవంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర

- పట్టు వస్త్రాలు సమర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకట్, కమిషనర్ మల్లికార్జున్
- కన్నుల పండువగా అమ్మవారి కల్యాణోత్సవం, పెద్దపట్నం, బండ్లు తిరిగే కార్యక్రమాలు
- అధిక సంఖ్యలో హాజరైన భక్తజనం





ఆలయ మండపంలో పెద్దపట్నం వేసి అమ్మవారి కథ చెప్తున్న బైండ్ల పూజారులు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తెస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకట్, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు

హుస్నాబాద్, మే 23 : హుస్నాబాద్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఘటం కుండ ప్రవేశంతో పాటు ప్రత్యేక పూజలు అమ్మవారికి బాసికాలు కట్టి కల్యాణోత్సవం జరిపించడం ద్వారా జాతర ప్రారంభమైంది. అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉత్సవాలు జరుగగా, బైండ్ల పూజారుల ఆధ్వర్యంలో వేసిన పెద్దపట్నం, మత్తకొలుపు, అమ్మవారి జీవిత చరిత్ర కథ విశేషంగా ఆకట్టుకున్నాయి. బైండ్ల పూజారుల విన్యాసాలు, గావుపట్టే కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, కమిషనర్ మల్లికార్జున్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం బండ్లు తిరిగేకార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, ఈవో కిషన్‌రావుతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, బోజు రమాదేవి, వాల సుప్రజ, గోవిందు రవి, పెరుక భాగ్యరెడ్డి, బొల్లి కల్పన, పున్న లావణ్య, చిత్తారి పద్మ, స్వర్ణలత, ఆలయ అర్చకుడు పరమేశ్వరశర్మ, కమి టీ సభ్యులు, ఆలయ సిబ్బంది కుమారస్వామి, రమేశ్, హన్మంతు, గౌడ సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నెల రోజుల పాటు జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి.

## నేడు రూరల్‌లో విద్యుత్ అంతరాయం

సిద్దిపేటరూరల్, మే 23 : సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్, పుల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని గురువారం విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

### బెజ్జంకిలో..

బెజ్జంకి, మే 23 : కోహెడ మండలంలోని శనిగరం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు ఉన్న నేపథ్యంలో బెజ్జంకి మండలంలోని బెజ్జంకి, బేగంపేట, కల్లేపల్లి, రేగులపల్లి, గుగ్గిళ్ల, తోటపల్లి, వడ్లూర్, దాచారం, గూడెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీ మాణిక్యాలు తెలిపారు. ప్రజలు, రైతులు ఈ మార్పును గమనించి, సహకరించాలని కోరారు.

## దయానంద్ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు

బెజ్జంకి, మే 23: మండలంలోని గాగిల్లాపూర్‌లో ధ్యాననిష్ఠాశ్రమ వ్యవస్థాపకులు సద్గురు దయానందగిరి స్వామి తల్లి భూదమ్మ వర్ధంతి సందర్భంగా స్వామి విగ్రహానికి గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమంలో హోమం, హన్మాన్‌మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు అన్నాడి రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లే శం, మాజీసర్పంచ్ అన్నాడి సత్యనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లోక కల్యాణార్థం చండీయాగం

సిద్దిపేట టౌన్, మే 23 : సిద్దిపేట ఉమ పార్థివ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం నవగ్రహ రుద్ర చండీయాగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ మాస పౌర్ణమి రోజున లోకకల్యాణార్థం చండీయాగం జరుపుతున్నామని తెలిపారు.

# సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్, మే 23 : కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులకు సూచించారు. గురవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాకు సంబంధించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు మొదటి విడత శిక్షణ తరగతులను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రం నర్సాపూర్ బీవీఆర్‌ఐటీ కళాశాలలో, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. జిల్లాలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 79 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 80 మంది మొత్తం 159 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ సెంటర్‌లో కౌంటర్ల వారీగా ప్రతి సూపర్‌వైజర్ మిషన్‌లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా నియోజకవర్గ ఏఆర్‌వోను మాత్రమే సంప్రదించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, ఇందు కోసం కౌంటింగ్ ప్రక్రియ గురుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్‌డీవోలు సదానందం, బన్సీలాల్, జిల్లా ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ దేవకీదేవి, జిల్లా మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

# పట్టభద్రులు విద్యావంతుడిని ఆదరించాలి



చేర్యాల పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న టౌన్ అధ్యక్షుడు, నాయకులు



చేర్యాల మండలంలోని తాడూరులో ప్రచారం చేస్తున్న మండల అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్



చేర్యాల మండలంలోని ముస్త్యాలలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ తదితరులు

చేర్యాల, మే 23 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టభద్రులైన విద్యావంతులు విద్యావంతుడైన బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని ఆదరించాలని ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, బీఆర్‌ఎస్ టౌన్, మండలాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం కోరారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, నాయకులు గురువారం చేర్యాల పట్టణంతో పాటు తాడూరు, ముస్త్యాల, వీరన్నపేట తదితర గ్రామాల్లో గ్రాడ్యుయేట్స్‌ను కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సిద్ధిరాములు, బూరగోని తిరుపతిగౌడ్, నర్ర ఉపేందర్‌రెడ్డి, ఈరు ఐలయ్య, నూకల చంద్రం, అరిగే కనకయ్య, మేరింద్ల శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

**జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్**

దుబ్బాక, మే 23 : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. గురువారం దుబ్బాక మండలం రామక్కపేట పీహెచ్‌సీని (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో ప్రజలకు అం దుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎండల్లో పని చేసే వ్యవసాయ కూ లీలు, ఇటుక బట్టీల వద్ద, గృహ నిర్మాణాల్లో పని చేసే కార్మికులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వినోద్ బాబ్జీ, వైద్యాధికారి హిమబిందు ఉన్నారు.

## వైద్యం వికటించి బాలింత మృతి



భవాని మృతదేహం

గజ్వేల్, మే 23 : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే మగబిడ్డకు జన్మనిచ్చిన బాలింత మృతి చెందిన సంఘటన గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీ శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో గురువారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మణ్ భార్య భవానీ, ప్రసవం కోసం బుధవారం వచ్చి చూపించుకోగా, అంత బాగానే ఉందని చెప్పింది. ఆపరేషన్ చేసి కాన్పు చేస్తానని చెప్పిన వైద్యురాలు గురువారం ఉదయం ప్రసవం కోసం ఆపరేషన్ చేయడంతో పాటు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండనే గర్భసంచిని తొలిగించారని బంధువులు ఆరోపించారు. తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో పరిస్థితి విషమంగా ఉందని వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పారు. తమతో పాటు ఆపరేషన్ చేసిన డాక్టర్ కూడా రావాలని ఆమెను(డాక్టర్)ను వెంట తీసుకొని బంధువులు వెళ్లగా, దవాఖానకు చేరుకునే లోపే మార్గమధ్యలో భవానీ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బంధువులు మృతదేహాన్ని గురువారం రాత్రి దవాఖానలో పెట్టి న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. దవాఖానలో ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ సైదాలతో పాటు సిబ్బంది అక్కడికి చేరుకొని ఎలాంటి సంఘటన చోటుచేసుకోకుండా పర్యవేక్షించి, ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మర్కూక్, మే 23 : మండల పరిధిలోని వరదరాజ్‌పూర్‌లో రెండో కంచిక విరాజిల్లుతున్న వరదరాజస్వామి జాతరకు ఈ నెల 25న హాజరుకావాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఆహ్వానం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలాధ్యక్షుడు రాంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడితో కలిసి అందజేశారు.

## జహంగీర్ యాదవ్‌కు పరామర్శ



జహంగీర్ యాదవ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

వర్గల్, మే 23 : వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, ఉద్యమకారుడు మల్లెల జహంగీర్ యాదవ్‌ను గురువారం వేలూర్‌లో తన నివాసంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పరామర్శించారు. జహంగీర్ యాదవ్ కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్సచేయించుకున్నారు. పరామర్శించిన వారిలో కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, జిల్లా గౌడసం ఘం అధ్యక్షుడు గుండుకాడి వెంకటేశంగౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

### మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి, మే 23 : మిరుదొడ్డి మండల ఎంఈవో జోగు ప్రభుదాస్ అనారోగ్యంతో చికి త్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఎంఈవో ప్రభుదాస్‌ను పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకుడు సూకురి లింగం, మాజీ ఎంపీటీసీ బైరయ్య నాయకులు పాల్గొన్నారు.



ఎంఈవో జోగు ప్రభుదాస్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

సిద్దిపేట అర్బన్, మే 23 : నేటి నుంచి జూన్ 3 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలో అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేయడంతో పాటు 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు.

## కొనసాగుతున్న 'టెట్'

సిద్దిపేట అర్బన్, మే 23 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో టెట్ కొనసాగుతున్నది. ఈ మేరకు గురువారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 50 మంది అభ్యర్థులకు 41 మంది హాజరై.. 9 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 50 మంది అభ్యర్థులకు 48 మంది అభ్యర్థులు హాజరై ఇద్దరు గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షను కళాశాల ప్రిన్సిపాల్ వీపీ రాజు, ఇతర అబ్జార్వర్లు పర్యవేక్షించారు.

## విత్తన మేళాకు రైతులు తరలిరావాలి

సిద్దిపేటరూరల్, మే 23 : సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాల వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించే విత్తనమేళాకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పరిశోధన స్థానం అధిపతి శ్రీదేవి కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని, రైతులకు ఉపయోగపడే దొడ్డు రకం మేలైన వరి వంగడాలు, కంది విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు మేళాకు హాజరై నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి యాసంగి సీజన్‌లో అధిక దిగుబడి సాధించాలని కోరారు.

## కోహెడలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోహెడ, మే 23 : కోహెడ మండల కేంద్రంలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు ప్రారంభించారు. ఈసందర్భంగా సాకేత్ రామారావు మాట్లాడుతూ విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేల ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. విన్నర్ ట్రోఫీ, రన్నర్ ట్రోఫీ, మ్యాన్‌ఆఫ్ దిసిరీస్, మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ ప్రతి ఆటకు ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు తిప్పారపు నాగరాజు, పెసరు సుధాకర్, మహిపాల్‌రెడ్డి, సుకుమార్‌రావు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బడుల మరమ్మతులను పూర్తి చేయాలి



లద్నూర్‌లో పాఠశాల మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు (ధూళిమిట్ట), మే 23 : త్వరలో బడులు పున:ప్రారంభమవుతున్న దృష్ట్యా బడుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని లద్నూర్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన మరమ్మతు పనులను ఎంపీడీవో పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో ఖాజా మోహినుద్దీన్, టీఏ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల అదృశ్యం

గజ్వేల్, మే 23 : ఇంట్లో నుంచి వెళ్లిన దంపతులు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. గిరిపల్లి గ్రామానికి చెందిన లీల గణేశ్, కల్యాణి దంపతులు. ఇంట్లో ఖాళీగా ఉండడంతో ఏదైనా పని చేసుకోవాలని గణేశ్ తండ్రి మందలించడంతో ఈనెల 5న ఇంట్లో నుంచి వెళ్లిన భార్యాభర్తలిద్దరూ నేటికి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా లభ్యం కాకపోవడంతో తండ్రి చంద్రయ్య గజ్వేల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.